క్లుప్తంగా

భక్తిభావంతో మానసిక ప్రశాంతత



ఆధ్యాత్మిక సదస్సులో మాట్లాడుతున్న సూర్యానంద స్వామి

ఏలేశ్వరం: ప్రతి ఒక్కరూ భక్తిభావంతో ఉంటే మానసిక ప్రశాంతత లభిస్తుందని లక్ష్మీనర్సాపురం పీఠాధిపతి స్వామి సూర్యానందస్వామి అన్నారు. సిరిపురంలోని శ్రీచిద్గగానంద గీతాశ్రమంలో పౌర్ణమి పురస్కరించుకుని శుక్రవారం ఆధ్యాత్మిక సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం సమాజంలో మానవ సంబంధాలు అంతంత మాత్రంగా ఉన్నాయన్నారు. మానవులు మానసిక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. వీటన్నింటిని అధిగమించాలంటే భక్తి మార్గం ఒక్కటే మార్గమన్నారు. ప్రపంచవ్యాప్తంగా హిందూ సంస్కృతికి ప్రత్యేక స్థానం ఉందన్నారు. కార్యక్రమంలో యల్లపు సూర్యనారాయణ, ఆకుల నూకపతిరావు, తోట వీరమహేశ్వరరావు, మజ్జూరి వెంకటలక్ష్మి, పెదకాపు తదితరులు పాల్గొన్నారు.

సారా బట్టీపై దాడి



పోలీసులు పట్టుకున్న సారా ప్యాకెట్లు

గోకవరం: గ్రామ శివారున గంగాలమ్మ ఆలయం సమీపంలోని పామాయిల్ తోటలో అక్రమంగా నిర్వహిస్తున్న సారా బట్టీపై శుక్రవారం ఎస్సై వీఎస్‌వీ పవన్‌కుమార్ ఆధ్వర్యంలో సిబ్బంది దాడులు నిర్వహించారు. పోలీసులు దాడి చేశారన్న సమాచారం అందుకున్న సారా వ్యాపారస్తులు అక్కడి నుంచి పరారయ్యారు. ఈ దాడిలో 55 లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని, సుమారు 500 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసినట్టు ఎస్సై తెలిపారు.

దుర్గంధం భరించలేకపోతున్నాం



వేలంక ప్రధాన రహదారిపై పేరుకుపోయిన చెత్త

కిర్లంపూడి: వేలంక రహదారి పక్కన చెత్త వేయడంతో దుర్గంధం వెదజల్లుతోంది. స్థానికులు తడి, పొడి వ్యర్థాలు రోడ్డు పక్కనే వేయడంతో అది కుళ్లి దుర్వాసన రావడంతో ఆ దారిలో వెళ్లే వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి శుభ్రం చేయాలని కోరుతున్నారు. ఇటీవల చెత్త నుంచి సంపద ఎలా సృష్టించాలనే అంశంపై అధికారులకు శిక్షణఇస్తున్నారు. సంపద శిక్షణ తరగతులకే పరిమితమవుతాయా ఆచరణలో పెట్టే ఆలోచన ఉందా అని పలువురు ప్రశ్నిస్తున్నారు. అధికారులు చొరవ తీసుకుని పేరుకుపోయిన చెత్తను తొలగించాలని కోరుతున్నారు.

పంచారామ క్షేత్రంలో ప్రత్యేక పూజలు

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రం బాలాత్రిపుర సుందరి సమేత కుమారా రామభీమేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు జరిగాయి. ఫాల్గుణ మాసం, పౌర్ణమిని పురస్కరించుకుని ఈఓ బళ్ల నీలకంఠం ఆధ్వర్యంలో ఆలయ పండితులు అల్లకి రాజ్‌గోపాల్ శర్మ, వేమూరి సోమేశ్వరశర్మ, శ్రీకాకుళపు సత్యనారాయణమూర్తి, వినయ్, సన్నిధిరాజు వెంకన్నల ఆధ్వర్యంలో స్వామి వారికి అభిషేకం, పూజా కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తుల విగ్రహాలను పల్లకిలో ఉంచి ఆలయ ప్రాంగణంలో ఊరేగించారు. ఆలయానికి వచ్చిన భక్తులకు మధ్యాహ్నం అన్న ప్రసాదం ఏర్పాటు చేశారు. సాయంత్రం స్వామి వారిని అమ్మవార్లకు ప్రత్యేక అలంకరణలు చేశారు.

భక్తిశ్రద్ధలతో దుర్గమ్మ విగ్రహ ప్రతిష్ఠ

స్థానిక పాత సామర్లకోటలోని చంద్రశేఖర స్వామి ఆలయంలో శుక్రవారం కనక దుర్గ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ నిర్వహించారు. అతి పూరాతన ఆలయంగా పెంకుల షెడ్‌లో ఉండే ఆలయం గత ఏడాది తుపానుకు కూలిపోయింది. దాతల సహకారంతో ఆలయ కమిటీ నాయకులు, మహిళలు ఆలయ నిర్మాణాన్ని పూర్తి చేసి ఫాల్గుణ పౌర్ణమిని పురస్కరించుకుని విగ్రహ ప్రతిష్ఠకు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే చినరాజప్ప, పంచారామ క్షేత్ర ఈఓ బళ్ల నీలకంఠం, మాజీ మున్సిపల్ వైస్‌చైర్మన్ యార్లగడ్డ చిన్ని కౌన్సిలర్ బలుసు వాసు, ఆలయ కమిటీ నాయకులు పాల్గొన్నారు.

లక్ష్మీదేవి గ్రామోత్సవం

స్థానిక మాండవ్య నారాయణస్వామి ఆలయంలోని అమ్మవారి జన్మనక్షత్రమైన ఉత్తరను పురస్కరించుకుని శుక్రవారం సాయంత్రం భక్తి శ్రద్ధలతో గ్రామోత్సవం నిర్వహించారు. ఈ మేరకు ఉదయం అమ్మవారి అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు.

అడ్డదారుల్లో అక్రమార్జన

- బరితెగిస్తున్న గంజాయి ముఠాలు
- హైవేపై అక్రమంగా రవాణా
- ఉక్కుపాదం మోపుతున్న పోలీసులు
- జగ్గంపేట పరిధిలో 15 నెలల్లో రూ. 2 కోట్ల గంజాయి స్వాధీనం



గంజాయి ముఠా సభ్యులను చూపిస్తున్న ఎస్పీ బిందుమాధవ్

జగ్గంపేట: తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులు సంపాదించడానికి కొందరు అడ్డదారులు ఎంచుకుంటున్నారు. ముఖ్యంగా గంజాయిని ఇతర ప్రాంతాలకు రవాణా చేస్తూ అక్రమార్జనకు పాల్పడుతున్నారు. ఇలాంటి వారందరూ ముఠాలుగా ఏర్పడి తమ వ్యాపారాన్ని యథేచ్ఛగా కొనసాగిస్తున్నారు. గతంలో అటవీ మార్గాలలో రవాణా చేసే వారందరూ ఇప్పుడు 16వ నంబర్ జాతీయ రహదారిపైకి ఎక్కేస్తున్నారు. పోలీసుల కంటపడకుండా అనేక దారుల్లో వెళుతున్నారు. అడ్డువచ్చిన వారిపై దాడులకు సైతం వెనకాడడం లేదు.

పోలీసుల ఉక్కుపాదం

గంజాయి రవాణా చేస్తున్న వారిపై పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. ఎక్కడికక్కడ తనిఖీలు నిర్వహిస్తూ స్మగ్లర్ల ఆటకట్టిస్తున్నారు. సమాచార వ్యవస్థను బలోపేతం చేసి గంజాయి ముఠాల వివరాలను తెలుసుకుంటున్నారు. ఇప్పటి వరకూ గంజాయి కేసులలో దొరికిన వారిపై కేసులు పెట్టి జైలుకు మాత్రమే పంపేవారు. ఇకపై వారి స్థిరచరాస్తులను జప్తు చేసేందుకు పావులు కదుపుతున్నారు. గంజాయి కేసులలో ఫైనాన్సియల్ ఇన్వెస్టిగేషన్ ప్రారంభిస్తున్నట్లు ఎస్పీ బిందుమాధవ్ చెప్పడంతో గంజాయి ముఠాల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. గంజాయి ముఠాల ఎత్తులను చిత్తు చేస్తూ పోలీసులు ముందుకు వెళుతున్నారు.

రూటు మార్చారు

సుమారు 15 ఏళ్ల క్రితం అటవీ మార్గంలో కావిడిలో గంజాయిని మోసుకుంటూ రవాణా చేసేవారు. అడవి నుంచి జగ్గంపేట మండలం మల్లిసాల చేరుకుని, అక్కడ నుంచి వాహనాలలో తరలించేవారు. గతంలో మల్లిసాల గ్రామం గంజాయి కేంద్రంగా ఉండేది. కానీ ఇప్పుడు స్మగ్లర్లు రూటు మార్చారు. రకరకాల పద్ధతులలో వాహనాలలో గంజాయిని రవాణా చేస్తున్నారు. కంటైనర్ వెనుక భాగంలో షట్టర్ పెట్టి దాని వెనకాల గంజాయి ప్యాకెట్లు రవాణా చేస్తున్నారు.

ఎదురు దాడి

పోలీసుల నుంచి తప్పించుకోవడానికి గంజాయి స్మగ్లర్లు ఎదురు దాడులు చేస్తున్నారు. దొరికితే శిక్ష పడుతుందని కాబట్టి పోలీసులపై దాడికి దిగుతున్నారు. ఇటీవల కృష్ణవరం చెక్ పోస్టు వద్ద కారుతో కానిస్టేబుళ్లను ఢీకొని పారిపోయే ప్రయత్నం చేశారు. కొద్ది రోజుల క్రితం జగ్గంపేటలో దొరికిన 492 కేజీల గంజాయి కేసులో కారుతో పోలీసులను ఢీకొనే ప్రయత్నం చేశారు. అయితే పోలీసులు చాకచక్యంగా కారు అద్దాలను పగలగొట్టి నిందితులను పట్టుకున్నారు.



జగ్గంపేటలో పట్టుకున్న గంజాయి బస్తాలు, రవాణాకు వినియోగించిన వాహనం

కాసుల పంట

ఏజెన్సీలో పండించే గంజాయికి విపరీతమైన డిమాండ్ వుంది. దీంతో కొన్ని ముఠాలు ఈ వ్యాపారాన్ని భయం లేకుండా తెగించి చేస్తున్నాయి. ఏజెన్సీలో రూ.వెయ్యికి కొన్న గంజాయిని బహిరంగ మార్కెట్‌లో రూ.10 వేలకు అమ్ముతున్నట్లు సమాచారం. 2024లో జగ్గంపేట పోలీసు సర్కిల్ పరిధిలో పది గంజాయి కేసులలో 32 మందిని పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి 920 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. దీని విలువ రూ. 90 లక్షల వరకూ ఉంటుందని అంచనా. అలాగే 2025లో ఇప్పటి వరకూ 16 కేసులలో రూ.92.50 లక్షల విలువైన 925 కేజీల గంజాయిని పట్టుకుని, 16 మంది నిందితులను అరెస్టు చేశారు. ఇక్కడి నుంచి ఇతర రాష్ట్రాలతో పాటు దేశాలకు గంజాయి ఎగుమతి అవుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఆస్తులు జప్తు చేస్తాం



మాదక ద్రవ్యాలు, మత్తు పదార్థాల నిరోధక చట్టం (ఎన్‌డీపీఎస్) ప్రకారం ఉన్నతాధికారుల ఆదేశాలతో గంజాయి కేసులలో దొరికిన వారిపై ఫైనాన్సియల్ ఇన్వెస్టిగేషన్ ప్రారంభిస్తున్నాం. అంటే గంజాయి వ్యాపారం ద్వారా సంపాదించిన స్థిర, చరాస్తులను గుర్తించి జప్తు చేస్తాం. దీని వల్ల స్మగ్లర్లు ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడతారు. గంజాయి ముఠాలను పట్టుకునేందుకు సమాచార వ్యవస్థను ఎక్కడికక్కడ పెంచుతున్నాం.

– శ్రీహరి రాజు, డీఎస్పీ, పెద్దాపురం

ముఠాలను పట్టుకోవడం సవాలే



గంజాయి రవాణా ముఠాలను పట్టుకోవడం పెద్ద సవాలుగా మారింది. అయినా ప్రాణాలకు తెగించి పట్టుకుంటున్నాం. కృష్ణవరం చెక్‌పోస్టు వద్ద పోలీసు అవుట్ పోస్టు ఏర్పాటు చేసి, తనిఖీలు నిర్వహించడం సత్ఫలితాలను ఇస్తోంది. కొందరు స్మగ్లర్లు జనావాసాల మధ్యే గంజాయిని నిల్వ చేస్తున్నారు. జగ్గంపేటలోని ఒక కాలనీలో 17 బస్తాలలో 492 కేజీల గంజాయిని పట్టుకోవడం దీనికి నిదర్శనం. ఇలాంటి విషయాలు తెలిసినప్పుడు పోలీసులకు సమాచారం ఇచ్చి సహకరించాలి.

– వైఆర్‌కే శ్రీనివాసరావు, సర్కిల్ ఇన్‌స్పెక్టర్, జగ్గంపేట

గంజాయికి అలవాటు పడితే ప్రమాదం



గంజాయికి యువత అలవాటు పడితే చాలా అనర్థాలు జరుగుతాయి. కొన్ని కాలేజీల వద్ద విద్యార్థులకు కొందరు గంజాయిని విక్రయిస్తున్నారంటూ వార్తలు వస్తున్నాయి. జగ్గంపేటలో ఇలాంటి సంఘటనలో పలువురిని పోలీసులు పట్టుకున్నారు. గంజాయికి అలవాటు పడిన వారి ప్రవర్తన భయానకంగా ఉంటుంది. గంజాయి దొరకని పక్షంలో శాడిస్టులుగా మారతారు. ఆత్మహత్య చేసుకోవడం, హత్య చేయడం వంటివి చేస్తారు. గంజాయికి అలవాటు పడిన వారి ఆరోగ్యం దెబ్బతింటుంది.

– డాక్టర్ మేకా గంగాధరరావు, జగ్గంపేట

ప్రయాణికుల కళ్లల్లో మట్టి..

అనధికారింగా నిర్వహిస్తున్న ఇటుక బట్టీలు



కాకరాపల్లి శివారు ఇటుకబట్టీ ప్రాంతంలో వాహనం వెళుతున్నప్పుడు రేగుతున్న దుమ్ము

కోటనందూరు: ఇటుక బట్టీల నిర్వాహకులు ప్రయాణికుల కళ్లల్లో మట్టి కొడుతున్నారు. కాకరాపల్లి శివారులో తుని–నర్సీపట్నం రోడ్డును ఆనుకొని భారీ ఇటుకబట్టీ నిర్వహిస్తున్నారు. ఇటుకల తయారీలో భాగంగా ట్రాక్టర్లు రోడ్డుపై తిరగడం వల్ల బంకమట్టి రోడ్డును అంటుకుపోతుంది. అంటుకున్న మట్టి ఆరిన తరువాత దుమ్ము రేగి ప్రయాణికుల కళ్లల్లో పడుతుంది. ప్రస్తుతం వేసవి కావడంతో ఇటుకబట్టీ ప్రాంతంలో ఇటుక బూడిద భారీగా చెలరేగి కళ్లలో పడుతుందని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాలు కురిస్తే రోడ్డుకు అంటుకున్న బంక మట్టితో వాహనాలు జారి ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని ఆందోళన చెందుతున్నారు. కోటనందూరు మండలంలో 20కి పైగా ఇటుకబట్టీలు నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ బట్టీలపై అధికారుల తనిఖీలు కూడా లేకపోవడంతో నిర్వాహకులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారంటున్నారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న ఇటుకబట్టీలపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

బ్యాంకుల బంద్‌కు ఖాతాదారులు సహకరించాలి



తుని రీజియన్ ఇన్‌చార్జి శ్రీనివాసరావు దంపతులను సన్మానిస్తున్న ఎస్‌బీఐ యూనియన్ సభ్యులు

గండేపల్లి: ఎస్‌బీఐ (స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా) ఆధ్వర్యంలో ఈనెల 24, 25 తేదీల్లో జరగనున్న బ్యాంకుల బంద్‌కు ఖాతాదారులు సహకరించాలని ఎస్‌బీఐ, ఎస్‌యూఏసీ, ఆల్ ఇండియా స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా స్టాఫ్ ఫెడరేషన్, నేషనల్ కాన్ ఫెడరేషన్ ఆఫ్ బ్యాంక్ ఎంప్లాయీస్ జనరల్ సెక్రటరీ, యూనైటెడ్ ఫార్మా ఆఫ్ బ్యాంక్ యూనియన్ కన్వీనర్ ఎల్.చంద్రశేఖర్ తెలియజేశారు. మండలంలోని జెడ్ రాగంపేట పరిధిలోని పరిణయ ఫంక్షన్ హాల్‌లో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా స్టాఫ్ యూనియన్, అమరావతి సర్కిల్, రాజమహేంద్రవరం మాడ్యూల్ తుని రీజియన్ రీజనల్ కమిటీ సమావేశం శుక్రవారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో తగినంత సిబ్బంది లేకపోవడంతో ఖాతాదారులకు పూర్తిస్థాయిలో సేవలందించ లేకపోతున్నామన్నారు. ఈ నేపథ్యంలో తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ రెండు రోజుల పాటు బంద్ చేపడుతున్నట్టు పేర్కొన్నారు. పదవి విరమణ పొందుతున్న తుని రీజియన్ ఇన్‌చార్జిగా విధులు నిర్వహిస్తున్న క్రొవ్విడి శ్రీనివాసరావు దంపతులను ఘనంగా సన్మానించి సత్కరించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు యూనియన్‌కు చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో గౌరవ అతిథిగా స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా స్టాఫ్ యూనియన్ అమరావతి సర్కిల్ ప్రెసిడెంట్ ఆర్ నరేంద్ర కుమార్, రాజమహేంద్రవరం మాడ్యూల్ వైస్ ప్రెసిడెంట్ పేరి శాస్త్రి, డిప్యూటీ జనరల్ సెక్రటరీ బి.పాపారావు, తుని రీజియన్ అధ్యక్షులు ఎల్.విజయబాబు తదితరులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి



ఏలేశ్వరంలో పార్టీ శ్రేణులతో కో–ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు

ఏలేశ్వరం: పట్టణంలో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు అన్నారు. పట్టణంలో శుక్రవారం పార్టీశ్రేణులతో ఆయన సమావేశమయ్యారు. స్థానిక కోరాడ నగర్‌లో మున్సిపల్ కౌన్సిలర్ కోరాడ రామలక్ష్మీ, కోరాడ ప్రసాద్ దంపతులు ఏర్పాటు చేసిన పాన్‌షాపును ఆయన ప్రారంభించారు. అనంతరం పార్టీశ్రేణులతో మాట్లాడుతూ పట్టణంలో వార్డుస్థాయి నుంచి పార్టీని పటిష్టం చేయాలన్నారు. సీఎం జగన్ నాయకత్వంలో వచ్చే ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా పనిచేయాలన్నారు. తొలుత ఇటీవల ప్రమాదానికి గురైన అధ్యాపకుడు వాగు మాధవ్‌ను కలుసుకుని యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పార్టీ నేతలు బదిరెడ్డి గోవిందు, సామంతుల సూర్యకుమార్, సుంకర రాంబాబు, శిడగం వెంకటేశ్వరరావు, పైల విజయ్‌కుమార్, జువ్విన వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.

'ముద్రగడ' పరామర్శ



ప్రత్తిపాడులో గుడాల వెంకటరత్నంను పరామర్శిస్తున్న గిరిబాబు

ప్రత్తిపాడు: గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు గుడాల వెంకటరత్నంను నియోజకవర్గ పార్టీ కోఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు శుక్రవారం పరామర్శించారు. ఇటీవల స్వల్ప అస్వస్థతకు గురైన గుడాల వెంకటరత్నంను కలిసిన ముద్రగడ గిరిబాబు ఆయన యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ముద్రగడ వెంట ఏలేశ్వరం నగర పంచాయతీ కౌన్సిలర్ బదిరెడ్డి గోవిందు, మండల పార్టీ కన్వీనర్, రామిశెట్టి బులిరామకృష్ణ, పార్టీ నాయకులు జువ్విన వీర్రాజు, శేరు కృష్ణ, చిలకమర్తి వెంకటరమణ, సి.రాయవరం సర్పంచ్ వెంకటరమణ, అందే చిట్టికొండ తదితరులున్నారు.

చినశంకర్లపూడిలో ముద్రగడ పర్యటన

చినశంకర్లపూడి గ్రామంలో వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు పర్యటించారు. మాజీ సర్పంచ్ ఏపూరి ఏడుకొండలును మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయన యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామంలో పర్యటించారు. నాయకులను, అభిమానులను కలిశారు. కార్యకర్తలకు బాసటగా నిలుస్తానని ముద్రగడ గిరిబాబు భరోసా ఇచ్చారు. ఆయన వెంట సర్పంచ్ ఏపూరి రామారావు, గోళ్ల నాగేశ్వరరావు, మండల పార్టీ కన్వీనర్ రామిశెట్టి బులిరామకృష్ణ తదితరులున్నారు.

ఘనంగా హోలీ సంబరాలు



గోకవరం వెలమపేటలో హోలీ పండగ జరుపుకొంటున్న స్థానికులు

జగ్గంపేట: గ్రామంలో హోలి పండగను ఘనంగా నిర్వహించుకున్నారు.

రాజస్థాన్ నుంచి వచ్చిన చాలా కుటుంబాలు జగ్గంపేటలో వస్త్ర దుకాణాలు, ఎలక్ట్రికల్, సెల్ పోన్లు, ప్లబింగ్ సామాన్లు తదితర వ్యాపారాలు సాగిస్తు ఇక్కడ స్థిరపడిన వారు ఉన్నారు. వారు రంగులు చల్లుకుంటూ హోలిని సంతోషంగా జరపుకొన్నారు.

కోలాహలంగా ...

గోకవరం: హోలీ పండుగ సంబరాలు గోకవరం మండలంలో కోలాహలంగా జరిగాయి. చిన్నా, పెద్దా తేడా లేకుండా రంగునీళ్ల చల్లుకుని సందడి చేశారు. కుల, మతాలకు అతీతంగా ఒకరిపై ఒకరు రంగులు చల్లుకొని మత సామరస్యాన్ని చాటారు. గోకవరంలో వెలంపేటలో చిన్నారులతో పాటు పెద్దలు, మహిళలు హోలీ పండుగను ఘనంగా జరుపుకొన్నారు.

శంఖవరం మండలంలో..

శంఖవరం: మండలంలోని హోలీ పండగను చిన్నారులు ఘనంగా జరుపుకొన్నారు. చిన్నారులు ఒక్కరికొక్కరు రంగులు పూసుకుని ఉల్లాసంగా గడిపారు. దీంతో గ్రామాల్లో సందడి వాతావరణం నెలకొంది. మరి కొన్ని చోట్ల ఒక్కరిపై ఒక్కరూ రంగు నీరు జల్లుకున్నారు. ఆట పాటలతో చిన్నారులు ఆనందంగా గడిపారు.

లక్ష్మీదేవికి ప్రత్యేక పూజలు

జగ్గంపేట: హోలి పండగా సందర్భంగా స్థానిక రుక్మిణీ సత్యభామ సమేత రాజగోపాలస్వామి వారి ఆలయం క్ష్మీదేవి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి సహస్రార్చన, కనకధార పారాయణం, అష్టలక్ష్మి స్తోత్రాలు పఠించారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ సతీమణి జ్యోతుల లక్ష్మీదేవి వచ్చి పూజలు చేశారు. ఈ పూజా కార్యక్రమాలలో గ్రామానికి చెందిన మహిళ అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



జగ్గంపేటలో హోలీ సంబరాలు చేసుకున్న మార్వాడీలు



లక్ష్మీదేవి పూజలలో పాల్గొన్న మహిళలు



జి.కొత్తపల్లిలో రంగులు పూసుకుంటున్న చిన్నారులు

పొగమంచు కమ్మేసి..



ఇందిరా కాలనీ వద్ద కురుస్తున్న మంచు

ప్రభుత్వ బీసీ బాలికల వసతి గృహం వద్ద ...



ప్రత్తిపాడు: గ్రామానికి పొగమంచు కప్పేసింది. శుక్రవారం ఉదయం 8 గంటలు దాటినా మంచు తెర తొలగలేదు. వాహనదారులకు ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక ఇబ్బందులు పడ్డారు. ప్రత్తిపాడు గ్రామంపై పొగమంచు గొడుగు పట్టింది. ఔత్సాహికులు మంచు దృశ్యాలను తమ సెల్‌ఫోన్లలో చిత్రీకరించేందుకు ఆసక్తి కనబరిచారు.

మట్టి లారీలతో రోడ్డు ధ్వంసం

గోకవరం: గంగంపాలెం పంచాయతీ పరిధిలో మట్టి తవ్వకాలు అక్రమంగా జరుగుతున్నాయి. చేపల చెరువు కోసం రైతు వారి పంట పొలాలను తవ్వి మట్టిని విక్రయిస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఈ క్రమంలో మట్టిని తరలించడానికి భారీ లారీలను వినియోగిస్తున్నారని, వీటి వలన రహదారి పూర్తిగా దెబ్బతింటుందని గంగంపాలెం, ఠాకూరుపాలెం గ్రామస్తులు వాపోతున్నారు. పగలు, రాత్రి తేడా లేకుండా లారీలు రాకపోకలు సాగిస్తున్నాయని, దీనివల్ల ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై అధికారులు వెంటనే స్పందించి అక్రమ మట్టి తవ్వకాలను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

మరిడమ్మకు ప్రత్యేక పూజలు

పెద్దాపురం: స్థానిక మరిడమ్మ అమ్మవారికి ప్రీతికరమైన శుక్రవారం బంగారు, వెండి పుష్పాలతో పాటు పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ విజయలక్ష్మి ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, చండీహోమంతో పాటు బంగారు పుష్పాలతో పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆర్డీఓ కె.శ్రీరమణి అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు.

17 నుంచి ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

తుని రూరల్: హంసవరంలో నిర్వహిస్తున్న ఏపీ మోడల్ స్కూల్ (ఆదర్శ విద్యాలయం)లో 2025–26 విద్యా సంవత్సరానికి ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ప్రవేశాలకు ఈనెల 17 నుంచి ఆన్‌లైన్ దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు ప్రిన్సిపాల్ పుల్లా పద్మజ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆంగ్ల మాధ్యమంలో ఉచితంగా బోధిస్తామన్నారు. ఆసక్తి గల విద్యార్థులు జిల్లాలో ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో పదో తరగతి ఉత్తీర్ణుల ఉండాలన్నారు. దరఖాస్తు చేయడానికి అవసరమైన సమాచారం తెలుసుకునేందుకు ముందుగా apms.apc-fss.in లేదా cse.ap.gov.in వెబ్‌సైట్‌ను సందర్శించాలన్నారు. నెట్ బ్యాంకింగ్ ద్వారా మే 22లోగా దరఖాస్తు రుసుము చెల్లించి జనరల్ నంబరు పొందాలన్నారు. జనరల్ నంబరు ఆధారంగా ఆయా వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేయడానికి ఓసీ, బీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులు రూ.200, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు రూ.150 రుసుం చెల్లించాలన్నారు. రిజర్వేషన్ రూల్స్ ప్రకారం పదో తరగతి మార్కుల మెరిట్‌ను బట్టి ప్రవేశాలు కల్పిస్తామన్నారు. మరిన్ని వివరాలను ప్రిన్సిపాల్, ఎంఈఓ, విద్యాశాఖ అధికారుల నుంచి తెలుసుకోవాలన్నారు.

పుణ్యక్షేత్రాల యాత్రికునికి వసతి సౌకర్యాలు



స్వామీజీకి స్వాగతం పలుకుతున్న భారతీయ ధర్మపరిషత్ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు

గండేపల్లి: పుణ్యక్షేత్రాల సందర్శనార్థం మోటారుసైకిల్‌పై వెళుతున్న యాత్రికునికి భారతీయ ధర్మ పరిషత్ ఆధ్వర్యంలో స్వాగతం పలికి వసతిని ఏర్పాటు చేశారు. ఉత్తరప్రదేశ్‌కు చెందిన అంకుష్ రామనాథ్ స్వామీజీ వారణాసిలో కాశీ విశ్వనాథ్‌ను, కోల్‌కత్తాలో కాళీమాతను, పూరిలో జగన్నాథస్వామి దర్శనం అనంతరం ఆంధ్రప్రదేశ్‌లో అరసవిల్లిలో సూర్యనారాయణ స్వామి, సింహాచలంలో అప్పన్న, అన్నవరంలో సత్యనారాయణ స్వామి వారిని దర్శనం అనంతరం హైవే మీదుగా వెళుతున్న ఆయనకు భారతీయ ధర్మ పరిషత్ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు పాలచర్ల నాగేంద్ర చౌదరి ఘనంగా సత్కరించి వసతి సౌకర్యాలు కల్పించారు. ప్రయాణ యాత్రలో అంకుష్ రామనాథ్ స్వామీజీ అనారోగ్యానికి గురికావడంతో స్థానికంగా ఉన్న ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స చేయించినట్టు పేర్కొన్నారు. ఆయన ప్రయాణం శనివారం ఉదయం ప్రారంభమవుతుందని తెలియజేశారు. విజయవాడలో అమ్మవారి దర్శనం, తిరుపతిలో వేంకటేశ్వరస్వామిని దర్శించుకుని అనంతరం తమిళనాడు, కేరళ, కర్ణాటక, మహారాష్ట్రాలలో గల పుణ్యక్షేత్రాలను దర్శించుకోనున్నట్టు స్వామీజీ తెలియజేశాడు.